www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 20 అక్టోబర్ 2024

5

ఏలూరు



విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

చింతలపూడి కోర్టు జడ్జి మధుబాబు

ప్రజాశక్తి - టి.నరసాపురం



హాస్టల్ పరిసరాలు పరిశీలిస్తున్న జడ్జి

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చింతలపూడి కోర్టు జడ్జి సిహెచ్.మధుబాబు సూచించారు. మండలంలోని బొర్రంపాలెంలోని యేయి హవీలా చిల్డ్రన్ హోమ్‌ను స్థానిక ఎస్ఐ ఎం.జయబాబుతో కలిసి ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం పెట్టాలన్నారు. పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

కౌలు కార్డులున్నా.. అందని రుణాలు..!

కౌలురైతులకు రుణాల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం

జిల్లా సాగులో 70 శాతం కౌలురైతుల చేతుల్లోనే

ఖరీఫ్ ముగుస్తున్నా అరకొరగానే రుణాల మంజూరు

పశ్చిమలో రూ.102 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.125 కోట్లు

ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తేనే కౌలు రైతులకు న్యాయం



ప్రభుత్వాలు మారినా కౌలురైతుల బతుకులు మాత్రం మారలేదు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు ససేమిరా అంటున్నారు. జిల్లా వ్యవసాయంలో అగ్రభాగం కౌలురైతులే సాగు చేస్తున్నా బ్యాంకు రుణాల మంజూరులో మాత్రం అట్టడుగున ఉన్న పరిస్థితి నెలకొంది. దీంతో అందరికీ అన్నంపెట్టే అన్నదాత ఉసూరోమంటూ అప్పల కోసం పరుగులు తీయాల్సిన దుస్థితి కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి కౌలురైతులకు రుణాలందేలా చర్యలు తీసుకుంటేనే అన్నదాతకు మేలు జరిగే పరిస్థితి ఉంటుంది.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్రంలో అత్యధికంగా కౌలురైతులు ఉన్న జిల్లాలు ఏలూరు, పశ్చిమగోదావరినే. ప్రస్తుత ఖరీఫ్‌లో రెండు జిల్లాల్లో దాదాపు నాలుగున్నర లక్షల్లో వరి సాగు చేయగా అందులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నారు. సాగులో అగ్రభాగంలో ఉన్న కౌలురైతుల పట్ల బ్యాంకర్లు అత్యంత చిన్నచూపు చూస్తున్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు, కౌలురైతులకు బ్యాంకర్లు మంజూరు చేస్తున్న రుణాలకు అసలు పొంతన లేకుండా పోతుంది. జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళికలో కౌలురైతులకు ఇచ్చే రుణాలు ఒక్కశాతం కూడా లేని పరిస్థితి. ఖరీఫ్ ముగిసే దశకు చేరుకున్నా రెండు జిల్లాల్లో కౌలురైతులకు బ్యాంకర్లు ఇచ్చిన పంట రుణాల మంజూరు చూస్తే ఎవరైనా నోరెళ్లబెట్టాల్సిందే. 2019కు ముందు టిడిపి ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారం చూస్తే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో కౌలురైతుల సంఖ్యను భారీగా కుదించి సిసిఆర్‌సి (కౌలుకార్డులు) మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించిన పరిస్థితి నెలకొంది. వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల పదవీ కాలంలో కౌలురైతుల పరిస్థితి అత్యంత దుర్భరంగా మారింది. కౌలుచట్టంలో సైతం మార్పులు చేసి కౌలురైతులను నిలువునా దెబ్బతీశారు. కూటమి ప్రభుత్వం రావడంతో తమకు న్యాయం జరుగుతుందని కౌలురైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కౌలుచట్టంలో మార్పులు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. వచ్చే రబీ నుంచి కొత్త కౌలు చట్టం ప్రకారం కౌలుకార్డుల జారీ ప్రక్రియ జరుగుతుందని తెలిపింది. అక్కడ వరకూ బాగానే ఉంది. ప్రస్తుత ఖరీఫ్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 89 వేల మందికి, ఏలూరు జిల్లాలో 65 వేల మందికి కౌలుకార్డులు జారీ చేశారు. కార్డులిచ్చిన రైతులకైనా రుణాలు మంజూరు చేశారా అంటే అదీ లేకుండాపోయింది.

పంట రుణాల మంజూరులో ఇంత నిర్లక్ష్యమా..

కౌలుకార్డులు అందుకున్న రైతులకు సైతం బ్యాంకర్లు పంటరుణాలు ఇవ్వని దుస్థితి నెలకొంది. ప్రస్తుత ఖరీఫ్ ముగింపు దశకు చేరుకుంది. కౌలురైతులకు బ్యాంకర్లు మంజూరు చేసిన రుణాలు చూస్తే ఆశ్చర్యపోక తప్పదు. పశ్చిమగోదావరి జిల్లాలో 89 వేల మంది కౌలురైతులకు కౌలుకార్డులు ఇచ్చినట్లు లెక్కలు చెబుతుండగా ఇందులో దాదాపు 12 వేల మందికి రూ.102 కోట్లు మాత్రమే పంట రుణాలు మంజూరయ్యాయి. ఏలూరు జిల్లాలో 64,686 మందికి కౌలుకార్డులు మంజూరు చేయగా ఇప్పటి వరకూ 20,135 మందికి రూ.125.31 కోట్లు మాత్రమే పంటరుణాలు మంజూరు చేసిన పరిస్థితి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏలూరు జిల్లా వ్యవసాయ రుణ ప్రణాళిక రూ.7,300 కోట్లు వరకూ ఉంది. కొద్దిరోజుల క్రితం జిల్లాకు చెందిన మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ వ్యవసాయ రుణ ప్రణాళికలో కౌలురైతులకు రూ.రెండు వేల కోట్లు పంట రుణాలుగా మంజూరు చేయాలని బ్యాంకర్లకు తెలిపారు. ఆయన చెప్పిన దానికి, బ్యాంకర్లు మంజూరు చేసిన పంట రుణాలకు అసలు పొంతనే లేకుండాపోయింది. వ్యవసాయ సాగులో అష్టకష్టాలు పడుతూ అందరికీ అన్నం పెడుతున్న కౌతురైతుల పట్ల బ్యాంకర్లు ఎందుకు చిన్నచూపు చూస్తున్నారో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. కౌలురైతులకు రుణాల మంజూరుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప అన్నదాతకు న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు. అవసరమైతే ప్రభుత్వమే కౌలురైతులకు గ్యారెంటీ ఇచ్చి రుణాలు అందించేవిధంగా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా బ్యాంకర్లు తీరు మారకపోతే అన్నదాత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు.

పిడుగుపాటుకు పాడి రైతు మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు




ఏడుకొండలు (ఫైల్‌ఫోటో)

మండలంలోని గోపాలపురం పంచాయతీ పరిధి పందిరెడ్డిగూడెంలో పాడి రైతు కైల ఏడుకొండలు (53) పిడుగుపాటుకు గురై మృతి చెందినట్లు విఆర్ఒ వేణుగోపాల్ తెలిపారు. శనివారం పశువులను మేపేందుకు వెళ్లిన ఏడుకొండలు వర్షం కురవడంతో చెట్టుకింద నిల్చుని ఉండగా పెద్ద శబ్దంతో పిడుగుపడింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం అవ్వగా కుమారుడు ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు.

ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని వినతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



ఎంఎల్ఎకు వినతిపత్రం అందిస్తున్న నిరుద్యోగులు

జిఒ నెం.3ను పునరుద్ధరించాలని, ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని కోరుతూ గిరిజన ప్రాంత నిరుద్యోగులు పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజును బర్రింకలపాడులోని క్యాంపు కార్యాలయంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ నెం.3 రద్దు కావడంతో రిజర్వేషన్లు లేక గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. జిఒ నెం.3ను పునరుద్ధరించాలని, త్వరలో రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వనుందని, దాంతోపాటు ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు కోటం లక్ష్మణరావు, నూనె శివాజీ, తెల్లం అజయ్, కారం నవీన్ కుమార్, తొడం నాగరాజు, కారం బేబీ శ్యామల, మడకం సంధ్యారాణి పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు



జిల్లాలోని వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల పరిష్కారానికి ఎటువంటి జాప్యమూ లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. లోకాయుక్త, జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల సంఘం, జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్, హైకోర్టు తదితర కోర్టుల్లో దాఖలైన కేసులపై జిల్లా అధికారులు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో కలిసి ఆమె శనివారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ లోకాయుక్త, జాతీయ, రాష్ట్ర మానవ హక్కుల సంఘం, జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్, హైకోర్టు తదితర కోర్టుల నుండి అందిన కేసులకు సంబంధించి పెండింగులో ఉన్న అంశాలపై సిబ్బందితో సమీక్షించుకోవాలన్నారు. రిట్ పిటీషన్లలో కోర్టులు ఇచ్చిన ఆదేశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కోర్టు ధిక్కరణ నమోదయ్యే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి పరిస్థితి రాకుండా అధికారులు ముందుగానే తీసుకున్న చర్యలపై నివేదికను సదరు కోర్టుకు సమర్పించాలన్నారు. సమావేశంలో ఆర్‌డిఒలు కె.అద్దయ్య, అచ్యుత అంబరీష్, వాణి పాల్గొన్నారు.

117 జిఒ రద్దు హర్షణీయం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెఎసి


ఏలూరు అర్బన్ : అన్ని ఉపాధ్యాయ సంఘాలు జెఎసి వ్యతిరేకించిన 117 జిఒను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం హర్షణీయమని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు రామారావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం విద్యావ్యవస్థలో తరగతుల విలీనంపై తీసుకొచ్చిన 117జిఒపై అన్ని ఉపాధ్యాయ సంఘాలు జెఎసి పక్షాన అనేక ఆందోళనలు చేపట్టినా గత ప్రభుత్వం సంఘాల వాదనను పక్కన పెట్టిందన్నారు. దీనిపై ఉపాధ్యాయ ఫ్యాప్టో, జెఎసి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 117 జిఒను రద్దు చేయాలని కోరిన పిమ్మట సదరు జిఒను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించకుండా విద్యావ్యవస్థను పటిష్ట పరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్స్ అందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని, ప్రతి కార్యాలయంలో ఉన్న పట్టభద్రులందరూ నమోదు చేసుకునేలా జిల్లా కలెక్టర్‌ని కలిసి ఫెసిలిటేషన్ సెంటర్‌ని ఏలూరు జెడ్‌పి అతిథి గృహం వద్ద ఉన్న స్థానిక జెడ్‌పి ఉద్యోగుల సంఘ భవనంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పాఠశాలల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



సిబ్బందితో మాట్లాడుతున్న రత్నప్రసాద్

పాఠశాలల్లో పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో రత్నప్రసాద్ వట్లూరు, సత్రంపాడు, శనివారపుపేట పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలుపై శనివారం తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజనంలో ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణం, మంచినీటి సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సత్రంపాడు హైస్కూల్ ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోవడం వల్ల పిల్లల రాకపోలకు చాలా ఇబ్బంది కలిగిస్తుందని, దీనిపైన ప్రధానోపాధ్యాయులు స్పందించి అధికారులను సంప్రదించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మంచి వాతావరణం కలిగించినప్పుడే చదువుపై ఏకాగ్రత ఏర్పడుతుందని, పాఠశాలలో పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల చదువులతో పాటు వారి ఆరోగ్యం, సంరక్షణ పైన ప్రత్యేక దృష్టి చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్ కూనా కృష్ణారావు, పి.వెంకటేశ్వరరావు, జివి.భాస్కర్, ఎ.గంగాభవాని, ప్యారా లీగల్ వాలంటీర్ మోహనరావు పాల్గొన్నారు.

లంచాలు తీసుకుంటే కఠిన చర్యలు

డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ఠ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డిఎంహెచ్ఒ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది ఎవరైనా లంచాలు తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ఠ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆమె శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో శర్మిష్ఠ మాట్లాడుతూ 2019లో సచివాలయాల్లో నియమించిన ఎఎన్ఎంలకు ఉద్యోగోన్నతుల కోసం ఒక పరీక్ష నిర్వహించామన్నారు. ఆ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారందరికీ ర్యాంక్ కార్డులు ఇచ్చామని తెలిపారు. ర్యాంకులు జారీ చేసిన తర్వాత జిల్లాలో ఉన్న సచివాలయాల ఆధారంగా ఆర్‌ఒఆర్‌ను అనుసరించి 1087 మందికి ఉద్యోగోన్నతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆ ఉద్యోగోన్నతులు కూడా ఎవరెవరికి ఏఏ సచివాలయాల్లో కేటాయించాలో ఒక కమిటీ నిర్ణయిస్తుందని, ఆ కమిటీలో తాను, జెడ్‌పి సిఇఒ, డిపిఒ, మున్సిపల్ కమిషనర్ సభ్యులుగా ఉంటారని వివరించారు. ఆ కమిటీ సభ్యులు జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి, అభ్యర్థుల జాబితాలను తయారు చేశామని, మళ్లీ అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే తెలియజేయాలని కోరతామని తెలిపారు. ఉద్యోగోన్నతులకు సంబంధించి జాబితా సిద్ధమైపోయిందని ఒక అసత్య ప్రచారం చేస్తున్నారని, దీన్ని ఖండిస్తున్నామని తెలిపారు. ఇంతకుముందు ఇచ్చిన జాబితాలో ఉన్న అభ్యర్థులు 297 మంది అభ్యంతరాలు వ్యక్తం చేశారని చెప్పారు. వారి అభ్యంతరాలు సరైనవి అయితే సరి చేసి మళ్లీ జాబితా సిద్ధం చేస్తామన్నారు. ఇదంతా కమిటీలో ఉన్న సభ్యుల నిర్ణయం ప్రకారమే జరుగుతుందని తెలిపారు. జిఒల ప్రకారంగానే ఎవరికైనా పారదర్శకంగా ఉద్యోగోన్నతులు కల్పిస్తామని తెలిపారు. కార్యాలయ సిబ్బంది ఎవరైనా లంచాలు అడిగినా, మోసపూరిత చర్యలకు పాల్పడినా తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రస్తుతం వచ్చిన అభియోగాలపై విచారణ జరిపించాలని జిల్లా ఎస్‌పిని కోరినట్లు చెప్పారు.

పేకాట క్లబ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - నరసాపురం




మాట్లాడుతున్న ఐజి జివిజి.అశోక్‌కుమార్

ఉమ్మడి గోదావరి జిల్లాల్లో పేకాట క్లబ్‌లను అనుమతించేది లేదని, ఎక్కడైనా అనధికారికంగా నిర్వహిస్తుంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలిచ్చామని ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్ చెప్పారు. శనివారం నరసాపురం డిఎస్‌పి కార్యాలయాన్ని, రూరల్ పోలీసుస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డివిజన్‌లోని ఎస్ఐలు, సిఐలతో శాంతిభద్రతలపై సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఛత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్ తర్వాత జిల్లాలో నక్సలైట్ల కదలికలపై నిఘా ఉంచామన్నారు. అయితే ఏలూరు ఏజెన్సీ ప్రాంతంలో కొంతమంది నక్సలైట్ల సానుభూతిపరులు తలదాల్చుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటీవల చత్తీస్‌ఘడ్ రాష్ట్ర పోలీసులు ఈ ప్రాంతాల్లో కొంతమంది సానుభూతిపరులను అరెస్టు చేసి తీసుకెళ్లారన్నారు. రెండు జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాది క్రైమ్ రేట్ పెరిగిందన్నారు. దీన్ని నియంత్రించేందుకు కఠినంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. సైబర్ నేరాల కట్టడికి తగిన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సైబర్ నేరం జరిగిన మూడు గంటల్లోపు పోలీసును ఆశ్రయించాలన్నారు. బాధితులు వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలు, గల్ఫ్ మోసాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయి విక్రయాలను పూర్తిగా నియంత్రించాలనే లక్ష్యంతో రవాణా, విక్రయదారుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, అడిషనల్ ఎస్‌పిలు భీమారావు, మురళీకృష్ణ, సిఐ యాదగిరి, ఎస్ఐలు ముత్యాలరావు, జయలక్ష్మి, వెంకట సురేష్ పాల్గొన్నారు

వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరం

జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక, ప్రతికోళ్లలంక గ్రామాల్లోని జెడ్‌పి హైస్కూళ్లలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల నోట్ బుక్స్ తనిఖీ చేసి పలు ప్రశ్నలు అడిగారు. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ 10వ తరగతి బోధించే ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన విద్యార్థులను 2025 మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షలకు అన్ని రకాలుగా సన్నద్ధం చేయాలన్నారు. దీనికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని, ప్రత్యేక తరగతులు నిర్వహించి ప్రతి ఒక్కరూ పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పండుగలు.. భారాలు..!

వరుస పండుగలు జరుగుతున్నాయి. దసరా పూర్తయ్యింది. దీపావళి రానుంది. అయితే భారాల బాదుడుకు ముగింపు కార్డు పడడం లేదు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటి జనం సతమతమవుతుండగా కూరగాయల ధరలు కొండెక్కాయి. ఈ ధరల నుంచి ప్రభుత్వం ఉపశమనం కల్పిస్తుందని ఆశించినా నిరాశే మిగిలింది. ఉల్లి, టమోటా, బియ్యం, నూనె వంటివి రైతు బజార్లలో అందుబాటులోకి తెచ్చినా అవి పట్టణ ప్రాంతాలకే పరిమితం కావడం, క్వాలిటీ లేకపోవడంతో జనానికి ఎటువంటి ఉపయోగమూ లేకుండాపోయింది. పెరిగిన ధరలు పేద, మధ్యతరగతి కుటుంబాల్లో తీవ్ర అలజడి సృష్టిస్తున్నాయి. ఆదాయం పెరగక, ఖర్చులు పెరగడంతో ఏం చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. దీంతో చాలా కుటుంబాలు దసరా పండుగను సాదాసీదాగానే జరుపుకున్నాయి. పిల్లలకు సెలవులు కావడంతో వారికి ప్రత్యేకంగా పిండి వంటలు కూడా చేయలేకపోయామని పలువురు వాపోయిన పరిస్థితి. ఈ క్రమంలోనే దీపావళి పండుగ ఎలా జరుపుకోవాలా అని తల్లడిల్లుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం మరో షాక్ ఇవ్వడానికి సిద్ధమైంది. ట్రూఅప్, ఇంధన ఛార్జీల పేరిట విద్యుత్ భారాలను మోపడానికి రంగం సిద్ధం చేయడంతో జనం ఖంగుతిన్నారు. ఇప్పటికే కరెంటు బిల్లుల భారం భరించలేని విధంగా ఉందని, కూటమి అధికారంలోకొస్తే బిల్లులు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు భారాలు మోపడం ఏంటని జనం ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఇప్పటికే సిపిఎం పెద్దఎత్తున విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళనలు నిర్వహిస్తోంది. దీపావళి బొనాంజాగా విద్యుత్ భారాలు మోపడం కూటమి ప్రభుత్వం ఆపుతుందో లేక షాక్ ఇస్తుందో వేచిచూడాలి.

గ్రామాల్లో కూటమి నేతల్లో పండుగ సందడి నెలకొంది. అదేమిటీ అనుకుంటున్నారా. అవును మద్యం దుకాణాల జాతరతో ఆయా పార్టీల నేతల్లో సందడి నెలకొంది. లైసెన్స్‌లు దక్కించుకున్న వారెవరైనా ఏ దుకాణం ఎక్కడ పెట్టాలి, ఆ దుకాణాలకు అనుబంధంగా గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు వంటివి అమ్మే బడ్డీ దుకాణం ఎవరు పెట్టుకోవాలి, అలాగే చికెన్ పకోడి దుకాణం ఎవరు పెట్టుకోవచ్చు అనేది కూటమి నేతలే నిర్ణయిస్తున్నారు. నిర్ణయం అంటే దీని వెనుక జరిగే తతంగం బహిరంగ రహస్యమే. ఇక మద్యం దుకాణాల్లో వాటాలు, స్థానికేతరులు, అధికార పార్టీ అండదండలు లేనివారైతే ఎంతోకొంత సొమ్ము తీసుకుని లైసెన్స్‌ను కూటమి నేతలకు అప్పగించేస్తున్నారు. ఈ వ్యవహారాల్లో నేరుగా ఎంఎల్‌ఎల కుటుంబీకులే రంగంలోకి దిగి మంతనాలు సాగిస్తున్న పరిస్థితి ఉంది. దీనివల్లే ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మద్యం దుకాణాలు ప్రారంభం కాలేదని సమాచారం. చంద్రబాబు హెచ్చరికలను సైతం ఖాతరు చేయని పరిస్థితి క్షేత్రస్థాయిలో కన్పిస్తోంది. ఇక ఇసుక కూడా ఆన్‌లైన్ పేరిట వినియోగదారులకు అందని ద్రాక్షగా మారింది. మొత్తానికి నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడం, ఇసుక దొరకకపోవడం, మద్యం దుకాణాల్లో నేతల జోక్యం కూటమి ప్రభుత్వానికి మాయని మచ్చలుగా మిగలనున్నాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అదే సమయంలో మద్యం దుకాణాల విషయంలో జనసేన, టిడిపి నేతల మధ్య తీవ్ర విబేధాలు పొడచూపినట్లు తెలుస్తోంది. టిడిపి ఎంఎల్‌ఎలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో టిడిపి ఎంఎల్‌ఎలే ఏ దుకాణం ఎక్కడుండాలో నిర్ణయిస్తుండగా, జనసేన ఎంఎల్‌ఎలు ఉన్నచోట మాత్రం పట్టణం, గ్రామ పరిధి ఆధారంగా ఆ ప్రాంత టిడిపి, జనసేన నేతలు నిర్ణయిస్తున్నారు. తమ ఎంఎల్‌ఎ ఉన్న చోట తమ నిర్ణయం చెల్లనీయరా అని జనసేన శ్రేణులు ఆగ్రహం ప్రదర్శిస్తున్నారు.



దసరా, దీపావళి పండుగలతోపాటు రాష్ట్రంలో, జిల్లాలో పల్లె పండుగ పేరిట పెద్దఎత్తున అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ పనులన్నింటిలో ప్రధాన భాగం ఎన్‌ఆర్ఇజిఎస్ నిధులదే. ఎన్‌ఆర్ఇజిఎస్ నిధులతో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించే పనులు చేపట్టాల్సి ఉంది. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలోనూ కూలీలకు సంబంధం లేకుండా సిమెంట్ రోడ్లు నిర్మించారనే విమర్శలు వెల్లువెత్తాయి. అభివృద్ధి పనులే చేపట్టినా కూలీలకు ఉపాధి చూపేలా ఉంచాల్సిన బాధ్యత పాలకులదే. క్షేత్రస్థాయిలో ఎన్‌ఆర్ఇజిఎస్ లక్ష్యానికి అనుగుణంగా పనులు సాగేలా చూడాలని కూలీలు కోరుతున్నారు. లేకపోతే సొమ్మొకరిది.. సోకొకరిది అనే చందంగా పరిస్థితి తయారవుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి.

- వివిఎస్‌వి.ప్రసాద్

బాల్య వివాహాలను అరికట్టేందుకు సమిష్టి కృషి

నూజివీడు ఆర్‌డిఒ ఎం.వాణి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



మాట్లాడుతున్న ఆర్‌డిఒ ఎం.వాణి

బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ సమిష్టి కృషి చేయాలని నూజివీడు ఆర్‌డిఒ ఎం.వాణి చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ (సిఆర్ఎఎఫ్)వారితో కలిసి బాల్య వివాహాలను నిర్మూలినపై చర్చించేందుకు మండల అధికారులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌డిఒ వాణి మాట్లాడుతూ బాల్య వివాహాల పట్ల గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు సమాచారం తెలుసుకుని ఉండాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిసినప్పుడే అరికట్టగలమని తెలిపారు. బాల్య వివాహంపై అవగాహన కలిగి ఉండటం మహిళా సంరక్షకుల ముఖ్యపాత్ర అని చెప్పారు. ఐసిడిఎస్ సిడిపిఒ ఎస్‌వై.నూరాని మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పటిష్టమైన ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు సమాజంలో కలిగించే చేటును సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే అనర్థాలపై అవగాహన లేక బాధ్యత రాహిత్యంగానే అక్కడక్కడ నిర్వహిస్తున్నారన్నారు. వాటి నిర్మూలనకు పోలీస్, రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్య, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో పటిష్టమైన ప్రణాళికను రూపొందించి ముందుకు వెళ్లనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి శాఖ జిల్లా పీడీ పద్మావతి, డిసిపిఒ సూర్య చంద్రమణి, నూజివీడు డిఎస్‌పి ప్రసాద్, ఎంఇఒలు, పంచాయితీ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ బాబాయ్ సేవలు మరువలేనివి

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి పట్టణ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు (పోలీస్ బాబాయ్) సేవలు మరువలేనివని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. వెంకటేశ్వరరావు మృతికి చింతిస్తూ చిత్రపటానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పోలీస్‌బాబాయ్ ఆశయాలు ముందుకు తీసుకెళ్లామని తెలిపారు. ఆయనతో పాటు కూటమి నాయకులు ఉన్నారు.

నగరంలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్


కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నగరంలోని రెండో పట్టణ ప్రాంతాన్ని సిఐ రమణ ఆధ్వర్యంలో జల్లెడ పట్టారు. ఏలూరు నగరంలో రెండో పట్టణ పరిధిలో నేరాలు నిరోధం చేయుటకు సిఐ రమణ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గన్‌బజార్, బంగారు నాగన్నవీధి, తంగెళ్లమూడి ప్రాంతాల్లో శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ ప్రాంతాల్లో ఉన్న ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిఐ రమణ మాట్లాడుతూ నేరాలను నిరోధించే క్రమంలో శనివారం రెండో పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, రెండో పట్టణ ఎస్ఐ నాగకళ్యాణి, మూడో పట్టణ ఎస్ఐ ప్రసాద్, ఒకటో పట్టణ, రెండో పట్టణ, మూడో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దలను గౌరవించాలి

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులు పెద్దల మాట గౌరవించాలని, సంప్రదాయ అలవాట్లు పాటించాలని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే శనివారం నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థుల తాతలను, నాయనమ్మలను, అమ్మమ్మలను పిలిచి వారి అనుభవాలను విద్యార్థులకు వివరించారు. మండలంలోని గోపవరం ఎంపిపి పాఠశాలలో, హరిజనవాడ స్కూలులో తాతలను, నాయనమ్మలను, అమ్మమ్మలను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

చాట్రాయి : మండలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో తాతా నాయనమ్మల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.అబ్రహం ఆదేశం మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, పిల్లలు తాతా నాయనమ్మలతో ఎలా మెలగాలి, వారిని ఎలా చూసుకోవాలో వివరించారు. తాతా నాయనమ్మల దగ్గర నుంచి నీతి వాక్యాలు, నీతి కథలు, అనుభవాలు ఎలా పంచుకోవాలో చెప్పారు. అనంతరం తాతా,నానమ్మలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యా కమిటీ ఛైర్మన్ ఎస్‌కె.హసీనా సన్మానించారు.

నూజివీడు టౌన్ : గొల్లపల్లి శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ సెలబ్రేషన్స్ శనివారం నిర్వహించారు. గ్రామస్తులు గురు వెంపల్లి జీవరత్న, భవిశెట్టి సుబ్బారావులను ఘనంగా సన్మానించారు. పాఠశాల కమిటీ ఛైర్మన్ బవిశెట్టి వీరయ్య హాజరయ్యారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రవీంద్ర మాట్లాడుతూ పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలని, విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. అమ్మమ్మ, తాతయ్య, నాయనమ్మలను గౌరవం చూపాలని కోరారు.

అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - మండవల్లి


మాట్లాడుతున్న ఎస్ఐ

బాణసంచాను అనుమతులు లేకుండా విక్రయించడం, నిల్వ ఉంచడం చట్టరీత్యా నేరమని, అటువంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు హెచ్చరించారు. ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆదేశాల ప్రకారం బాణసంచా విక్రయదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం మాట్లాడారు. ఆర్‌డిఒ వద్ద నుంచి అనుమతులు పొందిన వారు మాత్రమే బాణసంచాను విక్రయించాలన్నారు. అంతేకాకుండా జాయింట్ యాక్షన్ కమిటీ పోలీస్, ఫైర్, రెవెన్యూ శాఖల అధికారులు నిర్ణయించిన ప్రదేశంలో షాపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇళ్ల మధ్య బాణసంచాను నిల్వ ఉంచినట్లు తెలిస్తే ప్రజలు పోలీసులకు 9440796436 సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

ప్రభుత్వాసుపత్రి ఆవరణను శుభ్రం చేయాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రభుత్వాసుపత్రి ఆవరణను శుభ్రం చేయాలని కొయ్యలగూడెం ఎంపిపి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గంజిమాల రామారావు ఆదేశించారు. ఆసుపత్రిలో అపరిశుభ్ర పరిస్థితులపై ఫిర్యాదులు రావటంతో ఆయన శనివారం ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి ఆవరణ నలుమూలల కలియ తిరిగారు. పాముల సంచారం ఎక్కువగా ఉందని సిబ్బంది సైతం తెలిపారు. దీంతో ఆవరణను శుభ్రం చేయాలని చెప్పారు. ఉపాధి హామీ చట్టంలో పనులు చేపట్టాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

ఎంఎల్‌సి ఓటు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పట్టభద్రులందరూ తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేసుకుని రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని టిడిపి నూజివీడు నియోజకవర్గ బిసిసెల్ అధ్యక్షుడు, తోటపల్లి గ్రామ మాజీ సర్పంచి ఆరేపల్లి శ్రీనివాసరావు కోరారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో శనివారం ఆగిరిపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

చింతలపూడి : చింతలపూడి పట్టణంలోని ఆర్‌కె.ఫంక్షన్ హాలులో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటు నమోదుపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొని మాట్లాడారు.

నేరాలు - ఘోరాలు

పడవ తిరగబడి యువకుడు మృతి

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక కాపీనీటి చెరువులో పడవపై చేపల మేత చల్లుతూ పడవ తిరగపడడంతో నీట మునిగి చిట్టూరి సుబ్రహ్మణ్యం(24) మృతి చెందాడు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ సంఘటనతో కోట కలిదిండి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కైకలూరు రోడ్డులో లైవ్ ఫిష్ వ్యాపారం చేస్తున్న తండ్రి రాంబాబుకు సుబ్రహ్మణ్యం చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. జన సైనికుడు సుబ్రహ్మణ్యం మృతి పట్ల జనసేన నాయకులు విచారం వ్యక్తం చేశారు. పలువురు స్థానిక నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పిడుగుపాటుకు 9 మేకలు మృతి

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలోని దాసారం గ్రామంలో పిగుడుపాటుకు తొమ్మిది మేకలు మృతి చెందాడు. గ్రామంలో శనివారం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటల సమయంలో దాసారం గ్రామానికి చెందిన రైతు వీరాస్వామికి చెందిన తొమ్మిది మేకలు పిడుగుపాటుకు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

నాటుసారా స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - కుక్కునూరు

మండల పరిధిలోని నాటుసారా స్థావరాలపై కుక్కునూరు పోలీసులు దాడులు చేశారు. సిఐ రమేష్ బాబు సిబ్బందితో కలిసి మండల పరిధిలోని ఏలేరు గ్రామ శివారులో నాటుసారా స్థావరాలపై శనివారం దాడులు చేశారు. ఈ దాడిలో 1500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ రమేష్‌బాబు తెలిపారు.


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ హెచ్చరించారు. ఆగిరిపల్లి పెద్ద కొఠాయి సెంటర్ వద్ద వాహనదారులకు, పాదచారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే తీసుకొనే చర్యల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ ఇ.శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - కలిదిండి

విజిలెన్స్ అవేర్నెస్ వీక్ 2024లో భాగంగా కోట కలిదిండి ఎంపిపి పాఠశాలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కలిదిండి బ్రాంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవినీతిపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను బ్యాంక్ మేనేజర్ పి.ప్రవీణ్‌సాగర్, అసిస్టెంట్ మేనేజర్ పి.పావనిస్రవంతి అందించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

22 నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల పరిధిలో ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు భీమడోలు ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. గుండుగొలను గ్రామ సచివాలయం-1 వేదికగా చెట్టున్నపాడుకు ఈనెల 22, 23వ తేదీల్లో, ఆగడాలలంకకు ఈ నెల 24, 25వ తేదీల్లో సేవలు అందుతాయన్నారు. భీమడోలు గ్రామ సచివాలయం-1 వేదికగా భీమడోలు గ్రామ సచివాలయం-1 పరిధిలో ఈ నెల 22, 23వ తేదీల్లో, 24, 25వ తేదీల్లో సూరప్పగూడెం గ్రామపంచాయతీలకు సేవలందించే ఏర్పాట్లు చేశామన్నారు. ఇదే క్రమంలో పూళ్ల గ్రామ సచివాలయం-1 వేదికగా ఈ నెల 22, 23వ తేదీల్లో పూళ్ల గ్రామ సచివాలయం-1, 24, 25వ తేదీల్లో పూళ్ల గ్రామ సచివాలయం-3 పరిధిలోని ప్రజలకు సేవలందించేందుకు ప్రత్యేకించామన్నారు.

అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

ప్రజాశక్తి కుక్కునూరు

ఆటో డ్రైవర్లు వేగంగా ఆటోలు నడపొద్దని, అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడపాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. అల్లూరి సీతారామరాజు ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో పోచారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం వారు చేరాల్సిన గమ్యాన్ని ప్రాణాలు సైతం లెక్క చేయకుండా సురక్షిత ప్రాంతాలకు చేరవేర్చే ఆటో డ్రైవర్లు వారి ప్రాణాలను, కుటుంబాలను కూడా కాపాడుకునే విధంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. త్వరలో రోడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత అతివేగంగా వాహనాలు నడపొద్దని, ప్రమాదాలకు దూరంగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని, ప్రతిఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని, ఆటో డ్రైవర్ల సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు కుక్కునూరు మండల కేంద్రంలో పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేసి, పికపింగ్ పాయింట్, డ్రాపింగ్ పాయింట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, ఆటో యూనియన్ కార్యదర్శి ఘంటసాల రమేష్, గరటం హరిష్, దార కృష్ణ, వేల్పుల దుర్గయ్య, పెంకే మహేష్, శనగ రాము, పత్తి అశోక్, వెంకన్న, మంగరాజు, లోకి, చంద్రరావు పాల్గొన్నారు.

వసతి గృహాలను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - మండవల్లి

విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతి గృహాలను సమర్ధవంతంగా నిర్వహించాలని లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ న్యాయమూర్తి శ్రీమతి వివిఎన్‌వి.లక్ష్మి తెలిపారు. మండవల్లిలోని బిసి బాలుర, ఎస్‌సి బాలికల వసతి గృహాలను ఆమె శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, తాగునీరు, పడకలు తదితర సౌకర్యాలపై ఆమె ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో ఎక్కువ శాతం పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే ఉంటారన్నారు. పేద విద్యార్థులకు సౌకర్యాలు అందించడం కోసమే వసతి గృహాలు ఉన్నాయన్నారు. విద్యార్థులకు అందించాల్సిన సౌకర్యాల్లో నిర్లక్ష్యం వహించకుండా సకాలానికి సమర్ధవంతంగా అందించేలా చర్యలు తీసుకుని విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించాల న్నారు. విద్యార్థులు కూడా వసతి గృహాల ద్వారా అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పి.పవన్‌కాంత్, డి.శివప్రసాద్ బిసి, సామాజిక సంక్షేమ హాస్టల్ వార్డెన్స్ ఎంఎల్ఎస్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థులకు వర్క్‌షాపు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రభుత్వం వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించుకుని భవిష్యత్తులో అనేక ఉద్యోగావకాశాలను సృష్టించే లక్ష్యంతో ఉందని నూజివీడు ఆర్‌జియుకెటి క్యాంపస్ నిర్దేశకులు, ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చెందుతున్న జాబ్ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో విద్యార్థులకు సహాయపడటానికి ఆర్‌జియుకెటి యాజమాన్యం విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాలు, వర్క్‌షాపులు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. అందులో భాగంగా ఆర్‌జియుకెటి, ఐఐటి మద్రాస్ సహకారంతో, పియుసి-1 విద్యార్థుల కోసం డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై దృష్టి సారించి వర్క్‌షాపును, స్కూల్ కనెక్ట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఆర్‌జియుకెటిలో ట్రెనింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ప్లేస్‌మెంట్స్, ఇంటర్న్‌షిప్‌లు, ఇంక్యుబేషన్ డీన్ మిస్టర్ పి.శ్యామ్ మొత్తం నాలుగు క్యాంపస్‌ల నుంచి దాదాపు 235 మంది విద్యార్థులు పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. విజయవంతంగా వర్క్‌షాపును పూర్తి చేసిన విద్యార్థులు సర్టిఫికెట్ అందుకుంటారన్నారు. ఈ విలువైన వర్క్‌షాపును నిర్వహిస్తున్నందుకు పి.శ్యామ్‌ను అభినందించారు.

సర్పంచి కుటుంబసభ్యులకు మాజీ ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని ఇంజరం సర్పంచి జగిడి బాలరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాలరాజు కుటుంబ సభ్యులను పోలవరం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. జగిడి బాలరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెల్లం బాలరాజు మాట్లాడుతూ బాధ్యత గల నాయకుడు జగిడి బాలరాజును కోల్పోవడం చాలా బాధాకరంగా ఉందన్నారు. అతని మీద ఉన్న నమ్మకం, మంచితనంతో రెండు పర్యాయాలు సర్పంచిగా ఇంజరం ప్రజలు గెలిపించారన్నారు. ఆయన లేని లోటు పార్టీకి తీరని నష్టమన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి-1 తాండ్ర రాజేష్ మాదిరాజు వెంకన్నబాబు, మల్లెల చంటి నాయుడు, గొల్లపూడి వసంత్, శిలకాల రమేష్, నకిరికంటి నరసింహారావు, అయితా కోటేశ్వరరావు, మాగంటి శ్రీనివాసరావు, మారపాక రాము, గంజి శ్రీను, గంధం సుమంత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వింగ్ శాక్రి ప్రైస్ సంస్థ సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం


పోస్టర్లు, బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వక్తలు

లివింగ్ శాక్రి ప్రైస్ (ఎల్ఎస్ఎం) సంస్థ తన 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ ఎంఇ దేవసహాయం, ప్రేమకుమారి దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సంస్థ కార్యాలయంలో వేడుకలకు సంబంధించిన పోస్టర్లు, బ్రోచర్లను విడుదల చేశారు. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఐదు రోజుల పాటు కృతజ్ఞతోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 29న పొంగుటూరులోని మాటూరు ఫంక్షన్ హాలులో వెయ్యి మంది వృద్ధులకు, పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ ఐదు రోజుల్లో మొక్కలు నాటడం, క్రీడలు, బైబిల్ పరీక్షలు, రక్తదాన శిబిరాలు వంటి కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు. 25 ఏళ్ల క్రితం కొయ్యలగూడెంలో స్వచ్ఛంద సంస్థగా ప్రారంభమైన ఎల్ఎస్ఎం, మెట్ట ప్రాంత ప్రజల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని దేవసహాయం దంపతులు గుర్తు చేసుకున్నారు. పోలవరం, చింతలపూడి, గోపాలపురం నియోజకవర్గాలతో పాటు తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో గిరిజనుల అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వందకు పైగా తాగునీటి బోర్లు, కమ్యూనిటీ భవనాలను నిర్మించినట్లు వారు వివరించారు. ఈ వేడుకల్లో విశ్వాసులందరూ పాల్గొనాలని వారు కోరారు.

టిడిపిలోకి వైసిపి గ్రామ అధ్యక్షుడు

మండవల్లి : వైసిపి కానుకొల్లు అధ్యక్షుడు విష్ణుమూర్తిల శ్రీను శనివారం టిడిపిలో చేరారు. భైరవపట్నంలోని కూటమి కార్యాలయంలో పార్టీ కండువా కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ మాట్లాడారు. అనంతరం నాగభూషణపురం, ఇంగిలంపాకలంక, గురువెల్లిపేట గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

బాధ్యులపై కేసు నమోదు చేయాలని వినతి

ముదినేపల్లి : అంబేద్కర్ విగ్రహాన్ని అవమానకరంగా తొలగించినందుకు బాధ్యులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు నిమ్మగడ్డ బిక్షాలు డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా ముదినేపల్లి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని నేషనల్ హైవే అధికారులు, కాంట్రాక్టర్ సిబ్బంది అవమానకరంగా తొలగించారని శనివారం నిరసన వ్యక్తం చేశారు. నేషనల్ హైవే అధికారులు మొదట్లో ఇచ్చిన మాట ప్రకారం విగ్రహ నిర్మాణ కమిటీ సూచించిన చోట దిమ్మి కట్టించి అంబేద్కర్ విగ్రహాన్ని పున:ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. అనంతరం బస్టాండ్ వద్ద నుంచి దళితుల పెద్దఎత్తున ఊరేగింపుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నేషనల్ హైవే అధికారులపై, వశిష్ట కన్‌స్ట్రక్షన్స్ వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని తహశీల్దార్ సుభానికి వినతిపత్రం అందించారు.

రీసర్వే గ్రామసభల సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - భీమడోలు

రెవెన్యూ రీసర్వే గ్రామసభల సేవలను సద్వినియోగపరుచుకోవాలని భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవి కోరారు. మండలంలోని దుద్దేపూడి గ్రామ రెవెన్యూ పరిధిలో రీసర్వే గ్రామసభను సర్పంచి నీలం శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారులు సోమయ్య, శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన తహశీల్దార్ అక్కడ రైతులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ పరిధిలో 810 ఎకరాల విస్తీర్ణంలో సాగు ఉండగా 917 భూకమతాలు ఉన్నాయన్నారు. గతంలో వీటి తాలూకా సర్వే కార్యక్రమం పూర్తయిందని తెలిపారు. ప్రస్తుతం నిర్వహించిన రీసర్వే గ్రామసభలో అభ్యంతరాలు తెలుపుతూ మూడు వినతి పత్రాలు రాగా, అవి సర్వే అనంతరం జరిగిన లావాదేవీల్లో పేరు మార్పు కోరుతూ వచ్చిన వినతులుగా తెలిపారు. మండల సర్వేయర్ ధర్మారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమారి, గ్రామపంచాయతీ కార్యదర్శి ధర్మ పాల్గొన్నారు.


భీమడోలు : వినతులు స్వీకరిస్తున్న తహశీల్దార్

ముదినేపల్లి : సర్వే తప్పులు సవరించుకునేందుకు ప్రభుత్వం గ్రామ సభలను ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ సుభాని తెలిపారు. మండలంలోని గురజ, పెనుమల్లి, సంకర్షణపురం గ్రామాల్లో శనివారం తహశీల్దార్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. మూడు గ్రామాల్లో కలిపి 13 అర్జీలు రైతుల నుంచి అందినట్లు తహశీల్దార్ తెలిపారు. అంతేకాకుండా ఈ గ్రామ సభలు జరిగే 15 రోజుల్లో కూడా రైతులు రీసర్వేకు సంబంధించిన తమ అర్జీలను సమర్పించవచ్చని చెప్పారు.

టి.నరసాపురం : రీసర్వే గ్రామ సభలు భూ యజమానులు వినియోగించుకోవాలని తహశీల్దార్ టిఎస్.సాయిబాబా సూచించారు. మండలంలోని అప్పలరాజుగూడెంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూ యజమానుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గన్నిన సురేంద్ర, నాగేంద్ర, శ్రీను, రీసర్వే డిటి స్రవంతి, విఆర్ఒ బోస్ పాల్గొన్నారు.

మండవల్లి : రీ సర్వేలో తలెత్తిన సమస్యలను పరిష్కరించే విధంగా నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ గోపాల్ కోరారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 26న ప్రత్తిపాడు, భైరవపట్నం, 29న చావులపాడు, లోకుమూడి, 30న సింగనపూడి, నవంబర్ 1న మూడు తాళ్లపాడు, 2న శోభనాద్రిపురం, ఆపాపురం, 5న అయ్యవారిరుద్రవరం, 6న మండవల్లి, 7న గన్నవరం, మోకాస కలవపూడి, 8న లింగాల, 12న కానుకొల్లు, 13న చింతలపూడిపుట్లచెరువు, 14న పసలపూడి, లేళ్లపూడి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో పల్లెపండుగ కార్యక్రమం ఎపి ట్రైబల్ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో రూ.26.50 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీనివాసు మాట్లాడుతూ మండలంలో గూటాల గ్రామ పంచాయతీలో రూ.ఐదు లక్షలు, కొత్తపట్టిసీమ పంచాయతీలో రూ.9.75 లక్షలు, పాతపట్టిసీమ పంచాయతీలో రూ.3.5 లక్షలు, పోలవరంలో రూ.తొమ్మిది లక్షల నిధులతో సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.

టి.నరసాపురం : మండలంలోని తిరుమలదేవిపేట గ్రామపంచాయతీ పరిధిలో పల్లె పండుగలో భాగంగా శనివారం తిరుమలదేవిపేట, మధ్యాహ్నపువారిగూడెం గ్రామాల్లో రూ.70 లక్షలు ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు సర్పంచి గొల్లపల్లి సరోజిని, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి పెద్ద పీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అడపా నాగరాజు, పెండ్యాల ప్రసాద్, జట్ల సత్యనారాయణ, ఆళ్ల బాలాజీ, డాక్టర్ రాంబాబు, సింగులూరి దొరబాబు, మధ్యాహ్నపు పెంటరావు, పాపాచార్యుల వీరేశలింగం, తోట సత్యనారాయణ, కాళ్ల శ్రీను, తోట శ్రీను, రామలింగేశ్వరావు, వరికూటి రాజేష్, మన్యం దుర్గారావు, యెల్లిన సూర్యప్రకాష్, పండు యడ్లపల్లి బాబూరావు, రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంలంలోని పరింపూడి పంచాయతీ పరిధిలో సుమారు రూ.1.20 కోట్లతో భారీ ఎత్తున సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు సర్పంచి ముప్పిడి విజయకుమారి తెలిపారు. పంచాయతీ పరిధిలోని 20 ప్రాంతాల్లో నిర్మించనున్న ఈ రోడ్లకు పంచాయతీ వార్డు సభ్యులతో కలిసి ఆమె శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో ఈ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని, ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి కాలనీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.

చింతలపూడి : 2003లో హైస్కూల్ రోడ్డును టిడిపి ప్రభుత్వమే నిర్మించిందని, ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వంలో రోడ్డు వేస్తున్నామని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. మండలంలోని ప్రగడవరంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో జిల్లా పరిషత్ హైస్కూల్ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రగడవరం గ్రామ ప్రజలు, ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌కు, ముత్తారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చిన్నబాబు, ఎన్ఆర్ఇజిఎస్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని బొమ్మినంపాడు, వణుదుర్రు, దేవపూడి పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్ల నరసింహారావు, పర్యాటక అభివృద్ధి శాఖ డైరెక్టర్ కోడలి వినోద్ శంకుస్థాపన చేశారు.

కొనసాగిన టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (ఎపి టెట్-2024) శనివారం 15వ రోజు ప్రశాంతంగా జరిగాయి. వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సిబిఎస్ఇ పాఠశాలలో ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 185 మందికి 165 మంది హాజరయ్యారు. 20 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

రమణక్కపేటలో హైదరాబాద్ బస్సుకు స్టాప్ పాయింట్

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి జీవితాంతం రుణపడి ఉంటామని రమణక్కపేట గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. నూజివీడు నుంచి హైదరాబాదు వెళ్లే బస్సుకు రమణక్కపేట గ్రామంలో సర్వీస్ స్టాప్ పాయింట్ ఏర్పాటు చేయడంతో మంత్రికి, నూజివీడు ఆర్‌టిసి డిపో సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆర్‌టిసి బస్సుకు టిడిఇప గ్రామ అధ్యక్షులు ఆంజనేయులు, జనసేన నాయకులు పాశం నాగబాబు, ఎంపిపి కొండ దుర్గాభవాని వెంకట్రావు, గోళ్ల ఆంజనేయులు, ఆర్యవైశ్య మండలాధ్యక్షులు గోళ్ల రమేష్, ఆర్యవైశ్యుల నాయకులు, గ్రామ ప్రజలు స్వాగతం పలికారు.

22న జాతీయ రైతు సదస్సు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఈ నెల 22న విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు నూజివీడులో సుందరయ్య భవనంలో జాతీయ రైతు సదస్సు కరపత్రాలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 22వ తేదీన ఉదయం పది గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర సదస్సులను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అక్టోబర్ 22న విజయవాడలో రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే వ్యవసాయ రంగ రాష్ట్ర సదస్సులను జయప్రదం చేయాలని రైతు సంఘం మండలాధ్యక్షులు దాసరి జానకిరామిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో మండల కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి శిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటుందన్నారు. రైతాంగ సమస్యలపై ఈ నెల 22న విజయవాడలో రాష్ట్ర సదస్సు జరుగుతుందని, మండలంలోని రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు శేషగిరి, సూర్యారావు, నరసింహరావు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందులు

ప్రజాశక్తి - ముసునూరు

రైతులు వ్యవసాయంతో పాటు లాభసాటిగా ఉండే పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే పాడి పశువులకు, మేకలకు, గొర్రెలకు ఎటువంటి అనారోగ్యం లేకుండా చూసుకోవాలని టిడిపి వలసపల్లి గ్రామ అధ్యక్షులు మెదరమెట్ల సురేంద్ర అన్నారు. మండలంలోని వలసపల్లిలో వలసపల్లి పశు సంవర్ధక శాఖాధికారి ఎం.రత్న వర్ధన్, గుళ్లపూడి పశు సంవర్ధక శాఖకు సంబంధించిన అధికారి వై.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు నట్టల నివారణ మందు ఉచితంగా వేసినట్లు సర్పంచి దామోదరరావు తెలిపారు.

అధికారులకు సత్కారం

ప్రజాశక్తి - మండవల్లి

కొల్లేరు వరద ముంపులో నీట మునిగిన గ్రామాల్లోని ప్రజలకు తక్షణ సేవలందించే విధంగా ఆనంద్‌బాబు ఎంతో కృషి చేశారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యత సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. ఇటీవల ఆగిరిపల్లికి బదిలీపై వెళ్లిన ఇఒపిఆర్‌డి ఆనందబాబును మండవల్లి ఇఒపిఆర్‌డిగా బాధ్యతలు స్వీకరించిన చిట్టిపోతుల శేఖర్‌ను శనివారం కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇరువురిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవల్లి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఇఒపిఆర్‌డిగా ఆనందబాబు ఎంతో కృషి చేశారన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పట్టిసీమ గ్రామం స్థానిక రామకృష్ణ గీతాశ్రమంలో ఆదివారం ఉచిత హోమియో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకురాలు నందుల స్వరాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని పలు పంచాయతీల్లో మైకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు మాట్లాడుతూ ప్రతి ఆదివారం జగద్గురు పీఠం రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ఉచిత హోమియో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు.